హెచ్‌ఏ హెల్ పార్క్!

నిర్వహణ గాలికి.. పట్టింపులేదు ఎవరికీ.!

పార్కుల్‌లో నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన బాత్‌రూమ్‌లు






పార్కులో ఓ మూలన పేరుకుపోయిన చెత్తాచెదారం

హుడా లేఅవుట్ ప్రకారం 1974లో హెచ్‌ఏఎల్ కాలనీ ఏర్పడింది. అప్పుడు కాలనీవాసుల కోసం 3708 గజాల స్థలాన్ని పార్కు నిర్మాణానికి కేటాయించారు. 2002లో కూకట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధికి బీజం పడింది. పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి మొక్కలు నాటారు. అప్పటి నుంచి అలాగే ఉన్న పార్కులో గతేడాది ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీ పార్కు సమస్యల వలయంలో చిక్కుకుంది. పార్కు నిర్వహణను గాలికొదిలేయడంతో పార్కులో పచ్చదనం లేకుండాపోయింది. చెత్తాచెదారం పేరుకుపోయి పార్కు పరిసరాలు దుర్గంధంగా మారాయి. సరైన సౌకర్యాలు లేకపోవడంతో వాకర్స్, కాలనీవాసులు పార్కులోకి వెళ్లడం లేదు. దీంతో చీకటిపడగానే మందుబాబులు మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి.. వాచ్‌మెన్‌ను నియమించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– ఓల్డ్‌బోయిన్‌పల్లి

హెచ్‌ఏఎల్ పార్కు ప్రధాన ద్వారం



నాలాల పునరుద్ధరణ పనులు

వేగవంతం చేయాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని నాలాలను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే



మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలోని రామారావునగర్, కబీర్‌నగర్, బబ్బుగూడ, రాజీవ్‌గాంధీ నగర్‌లలోని నాలాలను కార్పొరేటర్ సబిహాబేగం, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా ఈ నాలల పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. ఈ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదలకు తన వంతు కృషి చేస్తానని అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ నాలాలను అభివృద్ధి చేయాలని, పనులను సత్వరమే పూర్తి చేయకపోతే రాబోయే వర్షాకాలంలో నాలాలు పొంగి ఇళ్లు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. అధికారులు కూడా కాంట్రాక్టర్‌తో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఏమైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, మాజీ కౌన్సిలర్ సిహెచ్. సత్యనారాయణ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఐలయ్య, సత్యం, తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

ఆస్‌బెస్టాస్‌కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన ఆస్‌బెస్టాస్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ ఆస్‌బెస్టాస్ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే గాంధీ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కాలనీ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు నర్సింలు, జనరల్ సెక్రటరీ మహ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ రఫీక్, ట్రెజరర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ దిష్టిబొమ్మ దహనం

బాలానగర్: కేరళలోని పూకోడే వెటర్నరీ, యానిమల్ హజ్బెండ్రీ యూనివర్సిటీలో రెండో సంవత్సరం చదువుతున్న జేఎస్ సిద్ధార్థ్ దారుణ హత్యకు కారణమైన ఎస్‌ఎఫ్‌ఐ గుండాలను కఠినంగా శిక్షించాలని జేఎన్‌టీయూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ గుండాల దాడిని నిరసిస్తూ వారి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నున్న పూజిత్, ఉపాధ్యక్షుడు చరణ్, జాయింట్ సెక్రటరీ శివమణి, పూర్ణ, శ్రీనివాస్, లోకేష్, ఆశిష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రజక కమిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఏఈ

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ శోభనాకాలనీలోని దోబిఘాట్‌లో రూ.40లక్షలతో నిర్మిస్తున్న కమిటీ హాల్ పనులను మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, డీఈ శ్రీదేవితో కలిసి పరిశీలించారు. స్థానిక రజక సంఘం నాయకులతో కలిసి పరిశీలించి వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం కమిటీ హాల్‌కు ప్రహరీ కావాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా కమిటీ హాలుకు ఇంకా ఏమేమి వసతులు కావాలని వాటికి సంబంధించిన నిధులు ఏర్పాటు చేసుకొని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, భాగయ్య, అశోక్, శ్రీను, సురేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ శిరీష మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని పవర్‌నగర్, చిత్తారమ్మనగర్, కైత్లాపూర్‌లలో 300 ఎంఎం డయా పైపులైన్, ఆంజనేయనగర్‌లో 450 ఎంఎం డయా పైపులైన్ల పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సలోమీ, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, భాస్కర్‌రావు, శ్రీనివాస్ పబ్బతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ వస్తువులపై అవగాహన అవసరం

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారి ప్రభాకర్



రాయదుర్గం: వస్తువు నాణ్యత, భద్రత, విశ్వసనీయత అనే అంశాలపై ప్రతి వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారి (బీఐఎస్) ప్రభాకర్ సూచించారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాసంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తే తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారనే నమ్మకంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వస్తువు కొనేప్పుడు వాటికి సంబంధించిన గుర్తులు, ఆగ్‌మార్క్ గుర్తులు, లైసెన్స్ వివరాలు, ఇతర అంశాలపై పూర్తి అవగాహనతో వాటిని గమనించి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్రతి వాటిలో కల్తీ, డూప్లికేట్ మార్కెట్‌లోకి వస్తున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా ప్రతి ఒక్కరూ కూడా అవగాహన కలిగి ఉంటే విక్రయించడానికి జంకే పరిస్థితి వస్తుందన్నారు.ఈ సందర్భంగా నీళ్ల బాటిల్‌ను చూపిస్తూ దాని నాణ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రాకేష్ మాట్లాడుతూ మనుష్యులు ఎలా ఉంటారో, నేటి రోబోలు ఎలా పనిచేస్తున్నాయో వాటి తేడాలను ఆయన వివరించారు. జీఐఎల్‌టీ ప్రొఫెసర్ అరుణకుమారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి వాటిలో గెలిచిన వారికి నగదు పురస్కారాలను అందించారు. కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధి ఏర్పాటు చేశారని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్‌లో ఇంజినీరింగ్ పనులకు రూ.6.5 కోట్లు, వాటర్ వర్క్స్ పనులకు రూ.కోటి, ప్రభుత్వ పాఠశాలలకు రూ.2కోట్లు కేటాయించామన్నారు. మరో విడతలో వచ్చే నిధులను ప్రతి డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కేటాయిస్తామని పేర్కొన్నారు.

అర్హులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తాం

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



బాలానగర్: కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలంలో జరిగిన ప్రజాదీవెన బహిరంగ సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ.. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, తెల్ల రేషన్‌కార్డు, సొంత ఇంటి ఖాళీ స్థలం కలిగిన వారికి, ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్న వారు లబ్ధిదారులుగా అర్హులన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎంపికైన అర్హులకు త్వరలో ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తామని తెలిపారు.

నిఫ్ట్‌లో క్రాఫ్ట్ మేళా -2024

ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు

మాదాపూర్: మాదాపూర్‌లోని నిఫ్ట్‌లో మూడురోజుల పాటు క్రాఫ్ట్ బజార్‌ను నిర్వహించనున్నారు. హస్త కళాకారులకు పట్టణ మార్కెట్లపై అవగాహన కల్పించడమే కాకుండా విద్యార్థులకు చేనేత వృత్తిపై అవగాహన కల్పించనున్నారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భారతదేశంలోని వివిధ క్రాఫ్ట్ క్లస్టర్‌ల నుంచి దాదాపు 45 మంది హస్తకళాకారులు పాల్గొనున్నారు.

వృద్ధురాలి మెడలోని మంగళసూత్రం చోరీ

కేసు నమోదు చేసిన పోలీసులు

భాగ్యనగర్‌కాలనీ: వాకింగ్‌కు వెళ్తున్న వృద్ధురాలి మెడలో నుంచి మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పరారైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న మల్లవ్వ అనే వృద్ధురాలు తన ఇంటి నుంచి పార్కు వైపు వాకింగ్ చేసుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి పరుగెత్తుకుంటూ వచ్చిన గుర్తు తెలియని దుండగుడు వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యాడు. లబోదిబోమంటూ బాధితురాలు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇందిరాహిల్స్ కాలనీకి చెందిన జోగిపేట రవీందర్ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.90వేల ఎల్‌ఓసీ పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మంగళవారం లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌యాదవ్, భిక్షపతి ముదిరాజ్, కాశీనాథ్‌యాదవ్, ఎండీ ఇబ్రహీం, మామిడాల రాజు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న పార్టీలను ఓడించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ లోగోను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ దేశాన్ని పాలిస్తూ వస్తున్న కాంగ్రెస్, బీజేపీ ఈ దేశ జనాభాలో సగానికి పైగా బీసీల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల్లో బ్లూ ఇండియా పార్టీ ద్వారా మాత్రమే సామాజిక న్యాయం దక్కుతుందని ఆ దిశగా బీసీలు చైతన్యవంతం కావాలన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి భూపాల్, కోశాధికారి భోంపల్లి మధు, ఉపాధ్యక్షులు షేక్ అమానుద్దీన్, సుంకర్ లింగారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి నుంచి ప్రేరణ పొందండి

భౌతికశాస్త్ర ఆచార్యుడు ప్రొ.బీవీఆర్ టాటా



పటాన్‌చెరు టౌన్: ఏ పరిశోధనకైనా ప్రకృతే మూలమని, దాని నుంచి ప్రేరణ పొంది, ప్రయోగశాలలో ఆచరణాత్మకంగా రుజువు చేయాలని భౌతికశాస్త్ర విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీవీఆర్ టాటా సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఫొటోనిక్ స్ఫటికాల నమూనాల ఘర్షణ: భౌతికశాస్త్రం, సెన్సింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై మంగళవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. కొల్లాయిడల్ క్రిస్టల్ టెంప్లేట్లు మూడు కోణాలలో నానోమీటర్ నుంచి సబ్ మైక్రోమీటర్ లక్షణాలతో ఆవర్తనాలను నిర్మించడానికి బహుముఖ సింథటిక్ సాంకేతికగా మారుతుందన్నారు.ఈ సాంకేతికత విభిన్న పరిమాణాలు, స్వరూపాలు, కూర్పులతో పోరస్ పదార్థాల సంశ్లేషణను అనుమతించడమే గాక, వివిధ సెన్సింగ్ అప్లికేషన్లకు దారితీస్తుందని చెప్పారు.ఇది భవిష్యత్తులో మరింత ప్రత్యేకమైన పదార్థాలు, అప్లికేషన్ల అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ విశ్వం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా రావాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పుష్పారెడ్డి, అనిత, దిలీప్, గోవింద్, రమాదేవి, భారతమ్మ పాల్గొన్నారు.



బండి రమేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నకిలీ బోర్‌వెల్ సర్వేలతో రైతులకు నష్టం

ఉస్మానియాయూనివర్సిటీ: నకిలీ బోర్‌వెల్ సర్వేలతో రైతులకు నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హైడ్రోజియాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా.రామావత్ హరి మాట్లాడుతూ.. భూగర్భశాస్త్రం (జియాలజీ) కనీస అవగాహన లేని వ్యక్తులు రాష్ట్ర వ్యాప్తంగా బోర్ పాయింట్లను చూస్తామని రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి నీళ్లు రావడం లేదని, ఇది అదునుగా భావించిన నకిలీ జియాలజిస్టులు విషయ పరిజ్ఞానం లేకున్నా యూట్యూబ్ చానల్స్ ద్వారా కొన్ని విషయాలు జియాలజిస్టులుగా చలామని అవుతూ రైతులకు బోరు పాయింట్లను చూపిస్తూ వేలల్లో దండుకుంటున్నారని ఆరోపించారు. విషయం అసోసియేషన్ దృష్టికి రావడంతో నకిలీ జియాలజిస్టులపై కేంద్ర భూగర్భ జలశాఖ సౌత్ రీజియన్ డైరెక్టర్ డా.కృష్ణమూర్తికి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఫిర్యాదు స్వీకరించిన డైరెక్టర్ నకిలీ జియాలజిస్టుల ఆట కట్టించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు శాఖ సహకారం తీసుకోనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులకారం విష్ణు, తిరుమలేష్, మిట్టల్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో భోజనశాల ప్రారంభం

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం నిర్మించిన కిన్నెర హాస్టల్ భోజనశాలను మంగళవారం వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.29.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన కిచెన్, మెస్ హాల్ తొలుత అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. మెస్‌హాల్లో 237 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయవచ్చని ఇంజినీరింగ్ విద్యార్థులకు 20 ఏళ్ల వరకు హాస్టల్ సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ విద్యాసాగర్, ప్రొ.మంగు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకుంటాం

ఉస్మానియాయూనివర్సిటీ: ఎంపీగా వంశీచంద్ రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేయనున్నట్లు పాలమూరు నిరుద్యోగ ఫోరం అధ్యక్షులు చుక్క రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో జరిగిన పాలమూరు నిరుద్యోగుల ఫోరం సమావేశంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించడం కరువు నేలపై వర్షం కురిసినంత ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేస్తున్న వంశీచంద్ రెడ్డి గతంలో ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా యువత అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించి ఆయనను పార్టీ గుర్తించి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రాఘవేంద్ర, ఓంకార్, సుధాకర్, శంకర్, నరేష్, కురుమయ్య, జానకిరామ్, సురేష్, విష్ణువర్ధన్, ప్రవీణ్‌రెడ్డి, లింగన్న, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

హఫీజ్‌పేట్: చందానగర్‌కు చెందిన శ్రీకృష్ణ భక్తురాలు వి.అనురాధ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ మోడీ ద్వారానే సనాతన ధర్మం కాపాడబడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొక్క బాల్‌రెడ్డి, త్రినాథ్, నందనం వినయ, పార్వతి పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువు సర్వే

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎర్రకుంట చెరువు సర్వే చేపట్టారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ పలు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డీఐ గంగాధర్ మాట్లాడుతూ చెరువు సర్వే అనంతరం హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏమైనా నిర్మాణాలు జరిగితే వాటిని మార్కింగ్ చేస్తామని తెలిపారు. మండల సర్వేయర్ సదానంద్, ఆర్ఐ కవిత, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని వావిలాల, అండూర్, జంగంపేట గ్రామాల్లో రూ.76 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీపతి గూడెంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు అభివృద్ధికి కృషిచేయాలి

కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొని నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరానగర్ కాలనీ నూతన సభ్యులు కాలనీలోని సమస్యలను పరిష్కరించటంలో కృషి చేయాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల చైర్మన్ నరసింహారెడ్డి, నూతన అధ్యక్షుడు గిరిసాగర్, ప్రధాన కార్యదర్శి అర్జున్, కోశాధికారి రాజు ముదిరాజ్, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన టిప్పర్

యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా,మరో యువకున్ని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన నీరుడి సందీప్ సాగర్(25)(డెలివరీ బాయ్) అతడి స్నేహితుడు మణి ఇరువురు కలిసి స్కూటీపై రామచంద్రాపురం మండలం సందిగూడెం వైపు నుండి నాగులపల్లి 100 ఫీట్ రోడ్‌లో వస్తుండగా కొల్లూరు ఓఆర్ఆర్ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నీరుడి సందీప్ సాగర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు మణికి గాయాలు కావడంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.